## హాలియాలో శ్రీచైతన్య పాఠశాల ఆఫీస్ సీజ్

హాలియా, మే 21 : హాలియాలో శ్రీచైతన్య పాఠశాల కార్యాలయాన్ని బుధవారం అనుముల మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి సీజ్ చేశారు. ఆ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిని బయటకు పంపించి తాళం వేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ హాలియాలో శ్రీచైతన్య పాఠశాలకు ప్రభుత్వ అనుమతి లేదని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం, ప్రచారం నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులను పక్కదోవ పట్టించడం సరికాదని చెప్పారు. ప్రభుత్వ అనుమతి లేకుండా హాలియాలో, గ్రామాల్లో శ్రీచైతన్య పాఠశాల పేరుపై ప్రచారం నిర్వహించరాదని, అడ్మిషన్లు తీసుకోవద్దని తెలిపారు.

## నేటి నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు

రామగిరి, మే 21 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుంచి 29 వరకు జరుగనున్నాయి. పరీక్షలకు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 12,954మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు. జనరల్ విభాగంలో 11,376 మంది, ఒకేషనల్ విభాగంలో 1,578 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5:30వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# సొరంగం కూలిపోతే చర్యలు శూన్యం

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై వివరణేది?

- సుంకిశాల గోడ కూలినా పట్టని ప్రభుత్వం
- నల్లగొండ బిడ్డలకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- హామీలను పక్కన పెట్టి నోటీసుల డ్రామాలు
- ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- నల్లగొండలో జిల్లా శంకర్ దంపతులకు ఆశీర్వాదం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్య నేతల హాజరు

నల్లగొండ ప్రతినిధి, మే21(నమస్తే తెలంగాణ) : 'ప్రభుత్వ పెద్దల కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం కుప్పకూలి మూడు నెలలు అవుతున్నది. ఇప్పటివరకూ అందులో చిక్కుకుపోయిన వారి మృతదేహాలను బయటకు తీయలేకపోయారు. ఆ పనుల్లో ఏం జరిగిందో చెప్పే పరిస్థితి లేదు. నల్లగొండ రైతులు, బిడ్డల తరుపున సీఎం రేవంత్‌రెడ్డిని అడుతున్నా.. దీనిపై సమాధానం చెప్పాలి' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలో జరిగిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, పార్టీ ముఖ్య నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి సమర్థవంతమైన సీఎం ఉండి ఉంటే మంగళ్‌గ్రామ్‌లో చిక్కుకున్న మనుషులను సైతం తీసుకురావచ్చన్నారు. కానీ ఇక్కడ ప్రభుత్వ అసమర్థత స్పష్టంగా అర్థమవతున్నదని విమర్శించారు. నల్లగొండ జిల్లా పరిధిలోని సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే నేటికీ అందుకు కారణమైన సంస్థపై విచారణ లేదని, కనీసం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వట్టెం పంపుహౌస్ మునిగినా, పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయినా పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల పేర్లతో విచారణ, నోటీసులు అంటూ డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు. ఎన్ని డ్రామాలు చేసినా ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు.



నల్లగొండలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ వివాహానికి హాజరైన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్

### నూతన దంపతులకు ఆశీర్వాదం

బీఆర్ఎస్వీలో కీలకంగా పని చేసి, ప్రస్తుతం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా కొనసాగుతున్న కనగల్ మండలం రేగట్టెకు చెందిన జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నల్లగొండలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో జిల్లా శంకర్ దంపతులను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆశీర్వదించారు. పెండ్లి మండపంలోనే శంకర్ కుటుంబ సభ్యులందరితో కేటీఆర్ ఓపికగా ఫొటోలు దిగారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చొరవ తీసుకుని వీరిని కేటీఆర్‌కు పరిచయం చేస్తూ కనిపించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తమ కుటుంబాలతో కలిసి కేటీఆర్‌తో ఫొటోలు దిగారు. పెండ్లికి వచ్చిన యువత, పార్టీ శ్రేణులు కేటీఆర్‌తో సెల్ఫీల కోసం ఎగబడుతూ వెంట నడిచారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఉమ్మడి జిల్లా నుంచి తరలి వచ్చిన పార్టీ నేతలందరినీ పేరుపేరునా పలకరిస్తూ ముందుకు సాగారు. అనంతరం అక్కడే పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడి, అనంతరం భోజనం చేశారు. ఆ తర్వాత జోరు వర్షంలోనే తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కూడా ఇతర సభ్యులతో కలిసి శంకర్ దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, పార్టీ నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, రాంచంద్రనాయక్, చకిలం అనిల్‌కుమార్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, తుంగబాలు, మందడి సైదిరెడ్డి, రాంబాబునాయక్, బోనగిరి దేవేందర్, శరణ్యారెడ్డి పాల్గొన్నారు.



సాగు చేసిన జీలుగ

# పత్తాలేని జీలుగ విత్తనాలు

- వానకాలం సమీపిస్తున్నా అందుబాటులో లేని విత్తనాలు
- సూర్యాపేట జిల్లాలో 7వేల క్వింటాళ్లకు సరఫరా చేసింది 1500 క్వింటాళ్లే
- విత్తనాల కోసం ఎదురుచూస్తున్న రైతులు

నేరేడుచర్ల, మే 21 : వానకాలం సమీపిస్తున్నది. కానీ జిల్లాకు అవసరమైన జీలుగ విత్తనాలు ఇప్పటి వరకు రాలేదు. మరో రెండు వారాల్లో వరి సాగు చేసే రైతులు జీలుగ కోసం ఎదురు చూస్తున్నారు. సరఫరా ఆలస్యమైతే సాగు కూడా వెనుకబడుతుందని వారు వాపోతున్నారు. ఎందుకంటే విత్తనాలు చల్లిన 40 రోజులకు పెరిగిన జీలుగ మొక్కలను కలియదున్నాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వరినాట్లు వేసుకోవాలి. జీలుగ విత్తనాలు చల్లడానికి సరైన సమయ ఇదేనని రైతులు అంటున్నారు. కానీ వ్యవసాయ శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఇంకా విత్తనాలు తెప్పించే పనిలోనే ఉంది. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి పెద్ద పీట వేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సీజన్ ప్రారంభానికి ముందే తెప్పించి సిద్ధంగా ఉంచేది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సరైన ప్రణాళిక లేక పోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.

### సరఫరాలో సర్కారు విఫలం

సూర్యాపేట జిల్లాలోని రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలను సరఫరా చేయడంలో వ్యవసాయ శాఖ విఫలం చెందుతున్నది. జిల్లాకు 7వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అవసరం అని ప్రతిపాదనలు పంపించారు. కానీ గత సంవత్సరం 900 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని, ఈ సారి కూడా 1500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయని అధికారులు తెలుపుతున్నారు. గత వానకాలంలో జిల్లాలో 4,85,064 ఎకరాల్లో వరి సాగు కాగా ఈ సారి సీజన్‌లో 4,85,125 ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు 7 వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ రాష్ట్ర శాఖకు ఇండెంట్ పంపింది. వాస్తవానికి మే మొదటి వారంలోనే జిల్లాకు ఈ విత్తనాలు సరఫరా కావాలి. కానీ ఇంత వరకూ జిల్లాకు చేరలేదు. మరో పది పదిహేను రోజులు సమయం పట్టే పరిస్థితి కనిపిస్తున్నది.

### వ్యవసాయ అధికారులకు తలనొప్పి

వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు పంపేది కొండంత అయితే అక్కడి నుంచి వచ్చేది మాత్రం గోరంతే అని పలువురు విమర్శిస్తున్నారు. నేరేడుచర్ల వ్యవసాయ అధికారులు మండలానికి 400 క్వింటాళ్లు జీలుగ విత్తనాలు అవసరం అని ప్రతిపాదనలు పంపించగా కేవలం 70 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపినట్లు తెలిసింది. వచ్చిన విత్తనాలు ఒక్కరోజు కూడా రావని, కార్యాలయానికి వచ్చే రైతులకు ఏ సమాధానం చెప్పాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు రైతుల గోసను అర్థం చేసుకొని కావాల్సిన విత్తనాలను సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

### సబ్సిడీపై స్పష్టత లేదు

నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వస్తున్నది. పట్టాదారు పుస్తకం ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందజేస్తుంది. ఈ సారి వానకాలం ఎంత సబ్సిడీపై విత్తనాలు అందజేస్తారనే దానిపై ఇంత వరకు స్పష్టత లేదు. గతంలో ఇచ్చిన విధంగానే 50 శాతం తగ్గకుండా ఇస్తారని అధికారులు పేర్కొంటున్నారు. జీలుగ విత్తనాలు జిల్లాకు వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సబ్సిడీ ఖరారు అవుతుందని, ఎన్ని సెంటర్లలో పంపిణీ చేస్తామనే విషయం తెలుస్తుంది.

## డిగ్రీ పరీక్షల్లో ఆరుగురి డిబార్

రామగిరి, మే 21: ఎంజీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలో బుధవారం జరిగిన రెండో సెమిస్టర్ రెగ్యులర్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 6,384మందికి 5,667 మంది హాజరయ్యారు. 714మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో రామన్నపేటలోని శ్రీహిందూ డిగ్రీ కళాశాలలో ఒకరు, మిర్యాలగూడ హసిత కళాశాలలో ఒకరు, నల్లగొండ డీవీఎం కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 1,355మందికి 1,162మంది హాజరయ్యారు. 190మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో నల్లగొండ నీలగిరి డిగ్రీ కళాశాలలో ఒకరు, మిర్యాగూడలోని హసిత, విజేత డిగ్రీ కళాశాలల్లో ఇద్దరు డిబార్ అయ్యారు.



ఆత్మకూర్.ఎస్ : ఏపూరు ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు



కోదాడ రూరల్ : పిడుగు పాటుకు మృతి చెందిన మేకల వద్ద విలపిస్తున్న లక్ష్మయ్య

# మండుటెండలో భారీ వర్షం

- ఉరుములు మెరుపులతో కురిసిన వాన
- పిడుగుపాటుకు అప్పాజిపేటలో మహిళా రైతు దుర్మరణం.. పలుచోట్ల పశువులు, జీవాలు మృత్యువాత
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వర్షంతో చల్లబడిన వాతావరణం



నార్కట్‌పల్లి : పట్టణ కేంద్రంలో నల్లగొండ రోడ్డు వద్ద జలమయమైన రహదారి

సూర్యాపేట, మే 21 : ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. గంట నుంచి రెండు గంటలపాటు వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. వర్షానికి పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. పిడుగుపడి పశువులు మృతి చెందాయి. వరద పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతోపాటు గాలిదుమారానికి విద్యుత్ సరఫరాలో అక్కడక్కడ అంతరాయం ఏర్పడింది. దుక్కులు దున్నేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### సూర్యాపేట జిల్లాలో..

సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు సూర్యాపేట, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్), నూతనకల్ మండలాల్లో పెద్దఎత్తున్న వర్షం పడింది. సుమారు రెండు గంటలపాటు వర్షం పడింది. సూర్యాపేట మండలంలో 66.5 మిల్లీమీటర్లు, చివ్వెంల 60.1, నూతనకల్ 46.0, ఆత్మకూర్(ఎస్)42.3, మద్దిరాల 41.3, మోతె 40.0, చిలుకూరు 25.5, హుజూర్‌నగర్ 24.5, నాగారం 19.3, తుంగతుర్తి 18.5, గరిడేపల్లి 18.0, మఠంపల్లి 12.0, నడిగూడెం 11.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పిడుగుపాటుకు జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో 10 మేకలు, కోదాడ మండలం నల్లబండగూడెంలో 36 మేకలు చనిపోయాయి. పెన్‌పహాడ్ మండలం అనంతారంలో, ఆత్మకూర్.ఎస్ మండలంలో ఏపూరులో వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది.

### నల్లగొండ జిల్లాలో..

తిప్పర్తి : నల్లగొండ జిల్లాలో పలు మండలాల్లో వర్షం పడింది. పీఏపల్లి, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం, నిడమనూరు, గుర్రంపోడు, మునుగోడు, తిప్పర్తి, కేతేపల్లి, నకిరేకల్, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురువగా శాలిగౌరారం, దేవరకొండ మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. పలు మండలాల్లో పిడుగులు పడ్డాయి. నల్లగొండ మండలం అప్పాజిపేట పరిధిలోని బంటుగూడెం గ్రామంలో పిడుగుపాటుకు వ్యవసాయ బావి వద్ద తోటలో పనిచేస్తున్న మహిళా రైతు చనిపోయింది. పిడుగు పడడంతో కట్టంగూరు మండలం కురుమర్తి గ్రామంలో రెండు బర్రెలు చనిపోయాయి. పెదఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగట్టు గ్రామంలో రెండు ఆవులు మృతి చెందగా మరో ఇద్దరు స్పృహ తప్పి కింద పడిపోయారు.



తిరుమలగిరి(సాగర్) : వరద నీటిలో వలలతో చేపలు పడుతున్న రంగుండ్ల తండా గ్రామస్తులు

# ఎకో టూరిజం ఏమాయె?

## సాగర్ వెనుక జలాల్లో ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయం



వైజాక్ కాలనీ సమీపంలో ఎకో టూరిజం ఏర్పాటుకు ఎంచుకున్న తెల్లగుట్ట ప్రాంతం

- రూ.5కోట్లు మంజూరు
- ఇప్పుడు ఆ ఊసే ఎత్తని కాంగ్రెస్ సర్కారు
- దృష్టి పెడితే అభివృద్ధి, మెరుగైన వసతులు
- పర్యాటకాభివృద్ధికి ఆస్కారం

**ఆకట్టుకునే ప్రకృతి రమణీయత.. ఆహ్లాదం పంచే సాగర్ వెనుక జలాల అందాలు.. పక్షుల కిలకిలు.. కనువిందు చేసే దృశ్యాలతో తెలంగాణ అరకుగా పేరొందిన ప్రాంతం దేవరకొండ నియోజకవర్గంలోని నేరెడుగొమ్ము మండల పరిధిలోని సాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతం. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో తెల్లగుట్ట కేంద్రంగా ఎకో టూరిజం ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలన.. ఎకో టూరిజం సాధ్యసాధ్యాలను పరిశీలించి టెండర్లను సైతం ఆహ్వానించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ఇక్కడ ఎకో టూరిజం ఊసే లేకుండా పోయింది. మొత్తం ప్రాజెక్టుపైనే నీలినీడలు అలుముకున్నాయి.**

– చందంపేట, మే 21

నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీపాటు సమీపంలోని ఏలేశ్వరం, కాచరాజుపల్లి వద్ద ఉన్న గాజుబేడం గుహలు, చందంపేట మండలంలోని దేవరచర్లలో రేచర్ల పద్మనాయకులు నిర్మించిన శివాలయాన్ని కలుపుతూ ఎకో టూరిజానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీజం పడింది. సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అప్పటి పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి నేతృత్వంలో పలుమార్లు క్షేత్ర పరిశీలన కూడా చేపట్టారు. వైజాక్ కాలనీ సమీపంలో సాగర్ వెనుక జలాల సమీపంలోని తెల్లగుట్ట వద్ద సర్వే నెం.201లో 12 ఎకరాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5కోట్లను సైతం మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎకో టూరిజం గురించి కనీసం పట్టించుకోవడం లేదు.

### ఎకో టూరిజం అభివృద్ధి చేయాలి



మా దగ్గర ఎకో టూరిజం అభివృద్ధి అవుతుందని చెప్తే ఎంతో సంబుర పడ్డాం. ఇప్పుడు పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం స్పందించి ఏర్పాటుచేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు పెరుగతాయి. పర్యాటకంగా మంచి ఆదరణ వస్తుంది.


-కారెజాన్ పిలిప్స్, వైజాక్ కాలనీవాసి

### ఆకట్టుకునే ప్రకృతి అందాలు



ఎకో టూరిజం ఏర్పాటు అయితే ఇక్కడ నుంచి ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితి ఉండదు. సాగర్ వెనుక జలాలు, ఇక్కడి ప్రాంతాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఎకో టూరిజం చేస్తే మరింత ఆదరణ లభిస్తుంది. ఇక్కడ ఆధ్యాత్మికతోపాటు ప్రకృతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

-తాతారావు, వైజాక్ కాలనీ వాసి



ఏలేశ్వరం గుట్ట

### ఎకో టూరిజంతో అభివృద్ధికి ఆస్కారం

ఎకో టూరిజం అభివృది అయితే వైజాక్ కాలనీతో పాటు బుగ్గతండా, తూర్పుతండా, చిన్నమునిగల్, పెద్ద మునిగల్, కాచరాజుపల్లి, సుద్దబాయితండా, బిల్డింగ్‌తండా, చందంపేట మండలంలోని మంగలి తండా, నక్కదుబ్బతండా, కంబాలపల్లి, దేవరచర్ల, యల్మలమంద గ్రామాల్లో అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ఈ ప్రాంతంలో పర్యాటకుల తాకిడి పెరిగి మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుంది. ఇటీవల కాచరాజుపల్లి సమీపంలో సాగర్ వెనుక జలాల్లో బర్మాస్వామి దేవాలయం నిర్మించగా, పెద్దమునిగల్ తుల్జా భవానీ జాతరలోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. వైజాక్ కాలనీ సమీపంలో సాగర్ వెనుక జలాలు అందాలను వీక్షించేందుకు వారాంతాల్లో పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. వారిలో హైదరాబాద్ నుంచి వచ్చే వాళ్లే ఎక్కువ. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎకో టూరిజంపై చొరవ చూపాలని ఈ ప్రాంత ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.



కాచరాజుపల్లి గ్రామ సమీపంలో గాజుబేడం గుహలు